
దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ కమాండ్ కంట్రోల్ రూంను బుధవారం ఆమె తనిఖీ చేశారు. దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 24, 48 గంటల్లో పరిష్కరించాల్సిన సమస్యలపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు.

పకడ్బందీగా ఉచిత ఇసుక సరఫరా

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి గనులు, భూగర్భ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు తెలిపారు. జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుపై బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను, జిల్లాలో పాటించాల్సిన చర్యలను వివరించారు. ఐవీఆర్‌ఎస్ నివేదిక, జీఎస్టీ తదితర అంశాల్లో అనుసరించాల్సిన మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, మైనింగ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలసిన సుబ్బారెడ్డి



డోన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని రాష్ట్రసీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ డి.సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్రమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిశారు. డోన్, బేతంచెర్లకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

అయ్యలూరు (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో సర్పంచి బాల ఓబులేసు అధ్యక్షతన బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామన్నారు. భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొంటామని చెప్పారు. కలెక్టరు రాజకుమారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన కొమ్ము రమణారెడ్డి వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.15 వేల విరాళం అందజేశారు. అనంతరం మంత్రి, కలెక్టరు ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, తహసీల్దారు ప్రియదర్శిని, ఎంపీడీవో సుగుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టవిప్పి చూడు..

■ ఆహారశాలలపై పర్యవేక్షణ కరవు
■ కల్తీ చేసి విక్రయిస్తున్న నిర్వాహకులు

కల్తీ తిండి ఉండు



కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే:

▸▸ నగరానికి చెందిన మోహన్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నారు.. గత శని, ఆదివారం సెలవు కావడంతో సొంతూరొచ్చారు. స్నేహితులతో కలిసి మధ్యాహ్నం గుత్తి పెట్రోలు బంక్ వైపు ఉన్న హోటల్‌కు వెళ్లారు.. చికెన్ బిర్యానీ, గోబి తిన్నారు. రాత్రి అయ్యేసరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు.. మధ్యాహ్నం తిండి బాగా లేకపోవడంతో ఇలా అయ్యిందని వైద్యులు సూచించారు. ఆ రోజంతా చికిత్స పొంది రూ.10 వేలు చెల్లించి డిశ్చార్జి అయ్యారు.

▸▸ నంద్యాలకు చెందిన రాహుల్ కుటుంబ సభ్యులు ఆసుపత్రికొచ్చారు. రెడ్‌క్రాస్ పక్కనున్న మొబైల్ క్యాంటీన్ వద్దకెళ్లి వడ, బోండా తిన్నారు. ఉదయమే వాంతులు, విరేచనాలతో పెద్దాసుపత్రిలోని అత్యవసర విభాగంలో చేరి వైద్యం చేయించుకున్నారు.

▸▸ వీరిద్దరే కాదూ.. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి నెలకు 1,300 మంది వరకు ఓపీ వస్తారు. వారిలో 40 శాతం మంది బయట ఆహారం తీసుకోవడంతో జీర్ణ సంబంధ జబ్బులతో వచ్చినవారే. ఇలాంటి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.. వీరంతా వ్యాధుల బారినపడి నరకయాతన అనుభవిస్తున్నారు. ఆహార పదార్థాలెన్నో కల్తీకి గురవుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తిరుపతి వేంకన్న లడ్డూలో కల్తీ నెయ్యి వాడటంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆహార పదార్థాల కల్తీపైనా కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు విన్నవిస్తున్నారు.

జేసీ పరిధిలో కేసులు : 49

కోర్టు పరిధిలో కేసులు : 32

■ జీర్ణకోశ వ్యాధుల బారిన జనం

సర్వజన ఆసుపత్రికి వచ్చినవారు

నెల	ఓపీ	ఐపీ
మే	1,214	325
జూన్	1,341	373
జులై	1,635	362
ఆగస్టు	1,185	296

రంగులద్ది.. తాజావని భ్రమింపజేసి..

● ఉపాధి, ఉద్యోగం, విద్య, వైద్యం తదితర అవసరాల నిమిత్తం పట్టణాలకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. హోటళ్లను ఆశ్రయించేవారూ క్రమంగా పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ బండ్ల సంఖ్య పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు కల్తీ చేస్తున్నారు.

● మాంసం, చేపలు, రొయ్యలతో తయారు చేసిన ఆహారాన్ని రోజుల తరబడి డీఫ్రిజ్‌లో ఉంచుతున్నారు. వినియోగదారులు కోరినప్పుడు వాటికి మసాలాలు దట్టించి, వేడివేడిగా వడ్డిస్తున్నారు.

● సాస్‌లు, బిర్యానీ, తందూరీ చికెన్లలోనూ కృత్రిమ రంగులు కలుపుతున్నారు. మిఠాయిలు, కేకులు, మసాలాలు, మాంసాహారానికి ఎరుపు రంగు, బంగాళాదుంప చిప్స్, పాప్‌కార్న్ వంటి వాటికి పసుపు రంగు, ఐస్‌క్రీమ్, సూప్‌లు, బఠానీలు తదితరాలకు నీలం, ఆకుపచ్చ రంగులు వాడుతున్నారు.

● కృత్రిమ రంగులు అద్దడం వల్ల అవి నాణ్యంగా, తాజాగా ఉన్నట్లు కనిపిస్తాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న వాటినీ తాజా పదార్థాలుగా భ్రమించి ఆరగించి వినియోగదారులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

పెరుగుతున్న బాధితులు

కల్తీ చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. నయంకాని రుగ్మతలకు గురయ్యే ప్రమాదమూ ఉంటోందన్నారు.

కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలు ఎక్కువ కాలం తినడం వల్ల మనుషులు క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంది. పిల్లల్లో హైపర్ యాక్టివ్, అలర్జీ లక్షణాలు కనిపిస్తాయి. పురుషుల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్లతోపాటు జీర్ణకోశ వ్యాధులు, ఉబ్బసం వంటివి తలెత్తుతాయి. సింథటిక్ రంగులు స్త్రీల విషయంలో రుతుసంబంధ ఇబ్బందులు, మైగ్రేన్ తలనొప్పి, థైరాయిడ్, గర్భకోశ, కిడ్నీ, కాలేయ వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

"హోటళ్లు, రహదారులపై బజ్జీలు, సమోసాలు, చికెన్ పకోడ, గోబీ వంటి వాటిని పదేపదే కాచిన నూనెతో చేయడం హానికరం. ఇలాంటివి తినడం వల్ల మొదట గ్యాస్ట్రిక్ అల్సర్ తర్వాత క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని" గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణుడు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

అధికారుల మొద్దు నిద్ర

● కల్తీకి అడ్డుకట్ట వేసేందుకు 'ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006' తీసుకొచ్చారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకం, వాడకం మొదలైన అంశాలకు సంబంధించి ఇది ప్రమాణాలను నిర్దేశిస్తోంది. 'భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ)' ఈ చట్టం అమలును పర్యవేక్షిస్తోంది.

● హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార తయారీ, విక్రయ కేంద్రాల్లో అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ప్రమాదకర రంగులు వాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లక్ష్యాలు నిర్దేశించుకొని నమూనాలు సేకరించి ఆహార కల్తీని, కృత్రిమ రంగుల వినియోగాన్ని అరికట్టాలి. కానీ ఈ చట్టాలేవీ సరిగ్గా అమలు కావడం లేదు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకొన్న హోటళ్లు 500 వరకు ఉన్నాయి.. అనుమతి లేనివి పది వేల వరకు ఉంటాయని అంచనా. వినియోగించే సరకులు, ఆహార పదార్థాల తయారీపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, నగరంలో కార్పొరేషన్ పరిధిలోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆరోగ్యాధికారి పర్యవేక్షించాలి. ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో పర్యవేక్షణ కావడం లేదు.

తనిఖీలు తక్కువ

■ చెక్‌పోస్టుల వద్ద కానరాని చర్యలు
■ పని చేయని సీసీ కెమెరాలు

తరలిపోయే ఖనిజం ఎక్కువ



విలువైన ఖనిజాలు అక్రమంగా సరిహద్దు దాటుతున్నాయి.. కేంద్రాల వద్ద తనిఖీలు మొక్కుబడిగా ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. గనుల శాఖ తనిఖీ కేంద్రాల వద్ద తప్పకుండా రాయల్టీ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉండాలి. . డోన్ చెక్ పోస్టును బుధవారం 'ఈనాడు-ఈటీవీ' బృందం పరిశీలించగా ఆర్ఐ ఎవరూ లేరు. కేవలం ఒక్కరే విధులు నిర్వహించారు. . వాహనంలో ఏ ఖనిజం ఉంది.. ఎక్కడికి వెళ్తోంది.. రాయల్టీ ఎంత చెల్లిస్తున్నారో నిర్ధారించుకోవాలి.. అవేవీ జరగడం లేదు. కొందరు కేంద్రం ఎదుట వాహనం ఆపి క్లీనర్ వచ్చి రాయల్టీ బిల్లు చూపి సీలు వేయించుకుని వెళ్లిపోయారు. మరికొందరు నిలపకుండానే దూసుకెళ్లారు.. సిబ్బంది అడ్డు చెప్పలేదు.. కొందరు కేంద్రానికి దూరంగా ఆపి సీల్ వేయించుకుని వెళ్లిపోయారు. ఇక రాత్రి వేళ చెప్పాల్సినవసరం లేదు.. సిబ్బంది కళ్లుగప్పి వాహనాలు రయ్... రయ్ మంటూ వెళ్లిపోతున్నాయి.

డోన్, డోన్‌గ్రామీణ, న్యూస్‌టుడే:

మూడు కేంద్రాల్లో మొక్కుబడి

పరిశీలన

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1970 హెక్టార్లలో లీజులు పొందిన గనులు ఉన్నాయి. డోన్, బనగానపల్లె, బేతంచెర్ల, కొలిమిగుండ్ల మండలాల్లో డోలమైట్, మొజాయిక్‌చిప్స్, లైమ్‌స్టోన్, గ్రానైట్ గ్రావెల్, సుద్ద, ముగ్గురాయి, ఐరన్‌ఓర్ వంటి ఎంతో విలువైన ఖనిజాలు ఉన్నాయి. వాటిని తవ్వి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు.

● విలువైన ఖనిజాలను కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తుంటారు. ఎలాంటి బిల్లులు లేకుండా తరలించే వాటిని అడ్డుకొనేందుకు డోన్, బేతంచెర్ల, కొలిమిగుండ్లలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

● నిత్యం బేతంచెర్ల కేంద్రం మీదుగా 300 ట్రాక్టర్లు, లారీలు, కొలిమిగుండ్ల చెక్‌పోస్టు నుంచి 300 నుంచి 350 ట్రాక్టర్లు, లారీలు వెళ్తుంటాయి. డోన్ చెక్‌పోస్టు ద్వారా 40 నుంచి 50 లారీల వరకు రోజుకు 1400 టన్నుల వరకు తరలివెళ్తుంది.

● ఆయా కేంద్రాల వద్ద తనిఖీలు మొక్కుబడిగా ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది.. ఇటీవల కర్నూలు నగర సమీపంలో ఉన్నతాధికారులు తనిఖీలు చేస్తుండగా సామర్థ్యానికి మించి డోలమైటును తరలిస్తున్న లారీని పట్టుకొన్నారు. మూడు కేంద్రాలను దాటి ఎలా వచ్చిందో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు.


తనిఖీ కేంద్రం వద్ద ఆపకుండానే వెళ్తున్న లారీ

ప్రభుత్వ ఆదాయానికి గండి

● గనుల్లోని ఖనిజాలు, పరిశ్రమల నుంచి మార్చిన పౌడర్, ఇతర రకాల వస్తువులను తరలించేందుకు తప్పనిసరిగా రాయల్టీలు చెల్లించాలి. గని తవ్వకం జరిగే ప్రాంతం నుంచి అది ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంతో ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి.

● డోలమైటు పౌడర్‌గా మార్చి తరలించేందుకు టన్ను ధర రూ.750 నుంచి 800 వరకు ఉంటోంది. ఇలా రూ.11 లక్షలకు పైగా ఖనిజాలు నిత్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి.

● గనుల తవ్వకాల వల్ల ప్రభుత్వానికి ఏటా రూ.500 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. అధికారుల తనిఖీలు పకడ్బందీగా ఉంటే మరో వంద కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. విలువైన ఖనిజాన్ని ఎలాంటి బిల్లులు లేకుండా రాత్రివేళల్లో చెక్‌పోస్టులను దాటిస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. అక్టోబరు 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఇతర వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు విద్యుత్తు శాఖ ఆపరేషన్ సర్కిల్

ఈనాడు, కర్నూలు: రాష్ట్రంలో జిల్లాల విభజనకు అనుగుణంగా విద్యుత్తు శాఖలో నూతన ఆపరేషన్ సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రతి జిల్లాకు ఒక ఆపరేషన్ సర్కిల్ ఉండేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా నంద్యాలలో ఒక నూతన సర్కిల్ ఏర్పాటు చేయనున్నారు. అందులో విధులు నిర్వర్తించడానికి కర్నూలు ఎస్ఈ కార్యాలయం నుంచి సగం మందిని అక్కడకు పంపనున్నారు. నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్లు ఆ సర్కిల్ పరిధిలో కొనసాగనున్నాయి. నూతన సర్కిల్ ఏర్పడ్డ నేపథ్యంలో నంద్యాలకు మరో ఎస్ఈ పోస్టు వచ్చినట్లైంది.

నిర్వహణ లేక వెలుగోడు

■ కోతకు గురవుతున్న జలాశయం కట్ట
■ కంపచెట్లు తొలగించేందుకూ కాసుల కష్టం



వెలుగోడు, న్యూస్‌టుడే : వెలుగోడు జలాశయం నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. ఐదేళ్ల పాలనలో పైసా నిధులు ఇవ్వకపోవడంతో చిన్న చిన్న మరమ్మతులు సైతం చేపట్టలేని దుస్థితి నెలకొంది. తెలుగుగంగ ప్రాజెక్టులో కీలకమైన ఈ జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 16.95 టీఎంసీలు. నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లోని లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, వందలాది గ్రామాలకు, చెన్నై నగరానికి తాగునీరు అందించడంలో కీలకమైన ఈ ప్రాజెక్టును పట్టించుకునే వారు కరవయ్యారు. వర్షం నీరు వెళ్లే దారిలేక మట్టి కట్ట పలుచోట్ల కోతకు గురైంది. కిందిభాగంలో గోతులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వ అధికారం లోకి వచ్చాక జలాశయం బలోపేతానికి అవసరమైన నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు.

● మట్టికట్టపై పడిన వర్షంనీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాల్వలు దెబ్బతిని పూడిపోయాయి. దీంతో వర్షంనీరు పక్కన ప్రవహించి కట్ట కోతకు గురైంది.

● కట్ట పైభాగంలో ఎటుచూసినా పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. సకాలంలో వీటిని తొలగించకపోతే కట్ట పటిష్ఠత తగ్గే ప్రమాదం ఉంది.

● గాలేరు వాగువైపు ఉన్న గేట్ల వద్ద లష్కర్ల కోసం కట్ట పైభాగంలో గది నిర్మించారు. తెలుగుగంగ ప్రధాన కాల్వకు ఉన్న గేట్ల వద్ద మరో గది ఉంది. నీటి విడుదలను నియంత్రించడంతో పాటు పహారా కాసే లష్కర్లు ఈ గదుల్లో విశ్రాంతి తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం వీటిలో ఓ గది ఒరిగిపోయింది. ఇది కూలితే ప్రాణాలు పోతాయన్న భయంతో వర్షాలు కురిసినప్పుడు సిబ్బంది బయట తడుస్తూనే విధులు నిర్వర్తిస్తున్నారు.

● గేట్లకు గ్రీజు పూసేందుకు కూడా కాసుల కష్టం వేధిస్తోంది.

ప్రతిపాదనలు పంపాం

వెలుగోడు జలాశయంతో పాటు సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నిర్వహణకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. వెలుగోడు జలాశయం కట్ట మరమ్మతులు, నిర్వహణకు నిధుల్లేక రెయిన్ డ్రైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరద గేట్లు, ప్రధాన కాల్వ, కట్ట మరమ్మతులకు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపాం.

– వెంకటేశులశెట్టి, ఈఈ, తెలుగుగంగ

మల్లన్నకు ఆరుద్ర నక్షత్ర పూజలు


రథం వద్ద దేవస్థానం ఈవో, అధికారులు


శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని మల్లికార్జునస్వామికి విశేష పూజలు జరిగాయి. స్వర్ణ రథాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. వర్షం కారణంగా మాడవీధుల్లో జరగాల్సిన రథోత్సవాన్ని నిలుపుదల చేశారు. రథంపై కొలువైన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. రథం ఎదుట కళాకారులు భక్తి గీతాలకు కోలాట నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.

చరవాణి రికవరీ మేళా రేపు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా వాసులు పోగొట్టుకున్న చరవాణుల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్న వాటిని యజమానులకు అప్పగించేందుకు శుక్రవారం సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి పోలీసు సిబ్బంది ఫోన్ చేసిన వారే హాజరు కావాలని సూచించారు. చరవాణులు పోగొట్టుకున్న వారి సీఈఐఆర్ పోర్టల్, వాట్సప్ చాట్‌బోట్ సేవను ఉపయోగించి ఫిర్యాదు చేశారన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సాధ్యమైనన్ని స్మార్ట్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

కాడితప్పిన రుణ సహకారం

■ కంప్యూటరీకరణ పేరుతో ఎగ్గొట్టారు
■ సీజన్ ముగుస్తున్నా 0.30 శాతమే



కౌలు రైతుల వ్యథ

ఖరీఫ్ 'కాలం' చివరి దశకు చేరుకొంది.. ఇప్పటికీ రైతులకు రుణాలు అందించలేదు.. కంప్యూటరీకరణ పేరుతో సహకార బ్యాంకులు రుణ పంపిణీని పక్కన పెట్టేశాయి.. విసిగి వేశారిన రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తెచ్చుకొన్నారు. రూ.330 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని ఆప్కాబ్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు నిర్దేశించింది. ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరుకున్న సమయానికి పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, కౌలు రైతులు.. అన్ని రకాలు కలిపి రూ.1,00,59,000 మేర రుణాలను 70 మంది రైతులకు పంపిణీ చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 0.30 శాతం పురోగతి సాధించారు. కనీసం ఒక్క శాతం రుణం ఇవ్వకపోవడం గమనార్హం.

కర్నూలు, నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే :

లక్ష్యం రూ.300 కోట్లు ఇచ్చింది నలుగురికే!

● వ్యవసాయ, అనుబంధ శాఖలకు సహకార బ్యాంకు శాఖల ద్వారా దీర్ఘకాలిక రుణాలు (ఎల్‌టీ లోన్లు) ఇవ్వాల్సి ఉంది. పొట్టేళ్ల పెంపకం, పాడి గేదెలు, ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వ్యవసాయం, ఉద్యాన పంటలు, పట్టు సాగు తదితర వాటికి దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాకు రూ.300 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వచ్చినా కేవలం నలుగురు రైతులకు రూ.33.69 లక్షలు ఇచ్చారు.

● ఈ ఏడాది షార్ట్ టర్మ్ రుణాల ఊసే లేకుండా పోయింది. ఎల్‌టీ రుణాలను రూ.100 కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెంచినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

రూ.20 కోట్లు అన్నారు.. రూ.40.90 లక్షలు ఇచ్చారు!

ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 6.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, సహకార బ్యాంకులు ఏటా ఒక్కో రైతుకు రూ.20 వేల నుంచి గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తుంటాయి. ఈ ఏడాది రూ.20 కోట్లు ఇవ్వాలని సహకార బ్యాంకు లక్ష్యాన్ని నిర్దేశించుకొంది. ఆగస్టులో పంట రుణాల లక్ష్యాలు నిర్దేశించిగా ఇప్పటి వరకు కేవలం 44 మందికి రూ.40.90 లక్షలు ఇచ్చారు.

పట్టించుకునే వారేరీ

▸▸ ప్రాథమిక సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు పాలక వర్గాలు లేవు. అధికారులే ఇన్‌ఛార్జి ఛైర్మన్లుగా కొనసాగుతున్నారు. పాలక వర్గాలు ఉండి ఉంటే రూ.100 కోట్లకు పైగా సహకార రుణాల పంపిణీ జరిగేవని అన్నదాతలు అంటున్నారు.

▸▸ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) డిజిటలైజేషన్ బాట పడుతున్నాయి. వచ్చే నెలాఖరుకు వంద శాతం ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

▸▸ సంఘాలకు అధ్యక్షులు లేకపోవడం.. సహకార అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కంప్యూటరీకరణపై దృష్టి సారించడంతో రుణాలిచ్చేవారే కరవయ్యారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. కర్నూలు జిల్లాలో 22,235 మందికి, నంద్యాల జిల్లాలో 27,780 మంది కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 44,877 మందికి కార్డులు పంపిణీ చేయగా మరో 5,775 మందికి ఇవ్వాల్సి ఉంది.

సాగు ధ్రువీకరణ పత్రాలు కలిగిన కౌలుదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.20 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్షకుపైగా పంట రుణాలు ఇవ్వాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఆప్కాబ్ ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాకు రూ.10 కోట్లను కౌలు రైతులకు ఇచ్చేందుకు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలో 98 ప్రాథమిక సహకార సంఘాల్లో ఒక్క కౌలుదారుడికి పంట రుణాలు ఇవ్వలేదు. కేవలం ఒక్క పసుపల ప్రాథమిక సహకార సంఘంలో 22 మంది కౌలుదారులకు రూ.26 లక్షలు ఇచ్చారు.

అధిక ఫీజు వసూలు చేసే ఆస్పత్రులపై చర్యలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజులు తీసుకోవాలని స్పష్టం చేశారు. నంద్యాలలోని మెడికేర్ డయాగ్నోస్టిక్, శ్రీకర, చందమామ, ప్రైమ్‌కేర్ ఆసుపత్రులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అనారోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఎక్కడా డెంగీ కేసులు నమోదు కాలేదన్నారు. డెంగీ పేరులో రోగుల నుంచి ఎవరైనా అధికంగా ఫీజులు తీసుకుంటే చర్యలు తప్పవన్నారు.

కస్తూర్బా బాలిక.. విజయాల మాలిక

• లాక్రోస్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపిక



చదువుతో పాటు ఆటల్లోనూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు ఆ విద్యార్థులు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ (జనరల్) బాలికల ఉన్నత పాఠశాలలో బి.అంజలి, జె.అఖిల తొమ్మిదో తరగతి చదువుతున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ శాంతి, వ్యాయామ ఉపాధ్యాయిని సునంద ప్రోత్సాహంతో కోచ్ అబ్దుల్ రసూల్ పర్యవేక్షణలో లాక్రోస్ క్రీడలో రాణిస్తున్నారు. ఇటీవల డి.బెళగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో ఈ ఇద్దరు క్రీడాకారిణిలు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఆగ్రాలో తమ సత్తా చాటేందుకు బయల్దేరి వెళ్లారు.

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే

అంజలి గెలుపు దారి



ఆదోని మండలం దిబ్బనకల్లుకు చెందిన బజార్, కృష్ణవేణి దంపతుల కుమార్తె బి.అంజలి. చదువు తోపాటే మరోవైపు లాక్రోస్ క్రీడలో రాణిస్తోంది. గత ఏడాదిగా శిక్షణలో మెలకువలు అందిపుచ్చుకుంది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. కోచ్ అబ్దుల్ రసూల్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటగలిగామని, జాతీయ స్థాయిలోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది అంజలి. ఉన్నత చదువులు చదివి పోలీసు అధికారిణిగా స్థిరపడి ప్రజలకు సేవ చేయాలనేదే తన లక్ష్యమని చెబుతోంది ఈ క్రీడాకారిణి.

అఖిల.. భళా



ఆదోని పట్టణం బండిమెట్ట కాలనీకి చెందిన ప్రభాకర్, మహేశ్వరి దంపతుల కుమార్తె అఖిల. లాక్రోస్ క్రీడలో సాధన చేస్తూ రాణిస్తోంది. బరిలో దిగితే జట్టు విజయానికి కృషి చేయడంలో దిట్ట. ఇటీవల డి.బెళగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెబుతోంది. మరో వైపు బాగా చదివి వైద్యురాలిగా స్థిరపడాలనేదే తన లక్ష్యమని అంటోంది క్రీడాకారిణి అఖిల.

అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక

అవుకు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు అవుకుకు చెందిన మధు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు బుధవారం తెలిపారు. తమిళనాడులోని రామనాథపురంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 30 నుంచి మూడు రోజుల పాటు నేపాల్‌లో జరిగే పోటీలకు భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతు మెడపై తేమ పూసిన పత్తి

• క్వింటాలుకు రూ.500-700 తగ్గుదల

• ఆందోళనలో అన్నదాత



పత్తికి టెండర్ వేస్తున్న వ్యాపారులు

ఒక్కసారిగా ఆకాశం వైపు దూసుకెళ్లిన పత్తి ధరలు.. ఒక్కసారిగా నేల చూపులు చూస్తున్నాయి. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. పది రోజుల కిందట క్వింటాలు పత్తి రూ.8,200 పలికింది. అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. పత్తి అమ్మకాలపై ఆసక్తి చూపారు. ఒక్కసారిగా క్వింటాలుపై రూ.500-700 ధర తగ్గుముఖం పట్టింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పండగల సీజన్ వస్తుండటంతో ధర ఉన్నప్పుడే అమ్ముకోవాలనే ఆలోచనతో రైతులు అధికంగా పత్తి దిగుబడులను మార్కెట్‌కు తెస్తున్నారు. అటు అతివృష్టి, అనావృష్టి, ఇటు ధరల పతనంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.


– న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్

తేదీ సెప్టెంబర్	గరిష్ఠంగా రూ.
12న	8219
13న	8219
14న	8257
17న	8219
18న	8249
19న	8229
20న	8139
21న	8038
23న	7769
24న	7625
25న	7561

పడిపోతున్న ధరలు

వారం రోజుల్లో క్వింటాలు పత్తి ధర గరిష్ఠంగా రూ.500-700 తగ్గాయి. ధరల పతనానికి తేమ శాతమే ప్రధాన కారణమని చెబుతున్నాయి మార్కెట్ వర్గాలు. నిజానికి తేమ శాతం 12-13 శాతం లోపు ఉండాలి. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న దిగుబడుల్లో 25 నుంచి 30 శాతం దాకా తేమ ఉంటోందంటున్నారు. సీజన్ ఆరంభం కాక మునుపే రోజు 10-12 వేల క్వింటాళ్ల దాకా రికార్డు స్థాయిలో పత్తి దిగుబడులు వస్తున్నాయి. వీటిలో సుమారు 60 శాతం దాకా తేమ దిగుబడులు ఉంటాయంటున్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో పరిస్థితులు తారుమారయ్యాయని పేర్కొంటున్నారు. పత్తి గింజలకు డిమాండ్ తగ్గి, దాని ప్రభావం దూదిపై పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. పది రోజుల కిందట పత్తి గింజలు క్వింటాలు ధర రూ.5,400 ఉండేది, ప్రస్తుతం రూ.4,400లకు పడిపోయింది. దూదిలో మైక్రోనర్ 3.7 నుంచి 4.1 వరకు ఉండాలి, అలాంటిది 4.9 నుంచి 5 దాకా ఉంటోందని పత్తి పరిశ్రమదారులు పేర్కొంటున్నారు. దీంతో స్పిన్నింగ్ సమయంలో దారం తెగిపోతోందంటున్నారు. ఉత్పత్తి సమయంలో వస్త్రం రంగు మారి, డ్యామేజ్ క్లాత్‌లా మారిపోతుందంటున్నారు. దీంతో వస్త్ర ఉత్పత్తిదారులు దూది కొనుగోళ్లకు ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వస్త్ర ఉత్పత్తి తగ్గిందంటున్నారు. నాణ్యమైన దూది బేళ్లకు ధర బాగా ఉందని, ప్రస్తుతం బేల్ దూది ధర రూ.57 వేల వరకు పలుకుతోంది. ధరల పతనం ఎంతవరకు కొనసాగుతుందనేది అంచనా వేయలేమని చెబుతున్నారు.

ఒకరి వెనక ఒకరు... ఆదర్శంగా నిలిచారు



చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుస క్రమంలో ఒకరివెంట ఒకరు నడుచుకొని బడికి వెళ్తూ ఆదర్శంగా నిలిచారు. దాదాపు 25 మంది విద్యార్థులు పట్టణంలోని మార్తోమ మిషనరీ వసతిగృహంలో ఉంటున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం స్థానిక వసతిగృహం నుంచి దాదాపు 2 కి.మీ. పాత జాతీయ రహదారిపైన ఒకేవైపు ఒకరి వెంట ఒకరు నడుచుకొని పాఠశాలకు వెళ్లారు. –న్యూస్‌టుడే, చాగలమర్రి

వాన కురిసింది... అవస్థలు మిగిల్చింది..



వర్షం కురిస్తే చాలు..పట్టణంలోని పలు ప్రాంతాలు బురదగా మారిపోతున్నాయి. డోన్ ఆదర్శ పాఠశాల పరిసరాలు అస్తవ్యస్థంగా మారుతున్నాయి. పాఠశాల లోపలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థల పాలవుతున్నారు. బురదనీటిలో కాళ్లు పెడితే గానీ బడికి వెళ్లి చదువుల్ని కొనసాగించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాస్త మట్టినిపోసి బురదలేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

హామీల అమలు ఎప్పుడు..?

డోన్, న్యూస్‌టుడే: హామీలను ప్రజలకు ఎప్పుడు అమలు చేస్తారని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు రామచంద్రయ్య అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా హామీలను పూర్తిగా నెరవేర్చలేదన్నారు. సీపీఐ రాష్ట్రకార్యవర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లాకార్యదర్శి రంగనాయుడు పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో గండ్లేరు జలాశయ సామర్థ్యం పెంపు



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న అఖిలప్రియ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ నియోజకవర్గ సాగు, తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గండ్లేరు జలాశయ సామర్థ్యాన్ని పెంచుతున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పురపాలిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రూ.40 కోట్లతో ప్రస్తుతం 0.3 టీఎంసీ నిల్వ సామర్థ్యాన్ని 0.9 టీఎంసీలకు పెంచుతామన్నారు. ఇందుకు గాను ఇప్పటికే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, పనులు ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరస్తున్నామని, పించనును రూ.4 వేలకు పెంచామని, దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. త్వరలోనే అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఆళ్లగడ్డ ఆసుపత్రి స్థాయిని 100 పడకలకు పెంచుతానని, నంద్యాల, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన ప్రజలు సైతం ఉత్తమ చికిత్సకు ఆళ్లగడ్డకు వచ్చేలా చేస్తానన్నారు. అనంతరం ఆమె విజయవాడ వరద ప్రాంతాల్లో సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు ఇచ్చి గౌరవించారు. మెప్మా ఆధ్వర్యంలో వస్తువుల విక్రయ కేంద్రాలను పరిశీలించారు. ఛైర్మన్ డా.రామలింగారెడ్డి, కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు హుస్సేన్ బాషా, పసల భారతి, గురుమూర్తి పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూములపై కసరత్తు

డోన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో జరిగిన ఫ్రీహోల్డ్ భూములపై రెవెన్యూ అధికారులు తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. డోన్ మండలంలో 2227 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ అయినట్లు అధికారుల లెక్కల్లో తేలిందంటున్నారు. 200 మంది మాత్రమే అసలైన అర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. 80 శాతం వరకు రికార్డుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత వసతి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లాలోని డిగ్రీ, పీజీ చదివే మైనారిటీ విద్యార్థులకు ఉచిత వసతి కల్పించనున్నట్లు ఉమ్మడి జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారిణి సబియా పర్వీన్ తెలిపారు. నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని మైనారిటీ వసతిగృహాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. వసతిగృహంలో భోజన సదుపాయం, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఏపీ పోస్ట్ మెట్రిక్ మైనారిటీ బాలుర వసతిగృహంలో ఉచిత వసతి పొందడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సబియా పర్వీన్ సూచించారు.

ఆబ్కారీ శాఖలో బదిలీల సందడి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి మద్యనిషేధ, ఆబ్కారీశాఖలో బదిలీలు మొదలయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం ఈ శాఖను అస్తవ్యస్తంగా మార్చిన సంగతి తెలిసిందే. పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసి మద్యనిషేధ, అబ్కారీ శాఖలో విలీనం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అసిస్టెంట్ కమిషనర్, ఒక్కో జిల్లాకు ఒక పర్యవేక్షణాధికారి, మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ స్టేషన్లకు యథావిధిగా సీఐలను నియమించి శాఖపరమైన పరిపాలనను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది. శాఖలో దశల వారీగా బదిలీలను మొదలుపెట్టిన ఉన్నతాధికారులు మొదటగా జిల్లా స్థాయిలో ఉండే డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, పర్యవేక్షణాధికారులకు స్థాన చలనం కలిగించారు. మలివిడతలో సహాయ పర్యవేక్షణాధికారులు, సీఐలు, ఎస్సైలను బదిలీ చేసి చివరగా హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేయనున్నారని తెలిసింది.

జిల్లా ఉన్నతాధికారుల నియామకం పూర్తి

ఉమ్మడి జిల్లా మద్య నిషేధ, అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పి.శ్రీదేవిని నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఉన్న ఈమెను ఈ స్థానానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడున్న డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఏలూరుకు బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావును కర్నూలు జిల్లాకు నియమించారు. నంద్యాలలో అసిస్టెంట్ కమిషనర్ మధుమోహన్ రావు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. కర్నూలు పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబును యథాస్థానంలో కొనసాగించనున్నారు. కర్నూలు మరో పర్యవేక్షణాధికారి రవికుమార్‌ను నంద్యాలకు బదిలీ చేసి అక్కడ పని చేస్తున్న పర్యవేక్షణాధికారి బి.రామ్మోహన్‌రెడ్డిని అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. పోస్టింగుల కోసం సహాయ పర్యవేక్షణాధికారులు, సీఐలు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు పత్రాలు సమర్పించారు. బదిలీ వ్యవహారంలో బార్ల యజమానులు జోక్యం చేసుకుని ప్రజాప్రతినిధుల సిఫారసు పత్రాలు ఇప్పించడం గమనార్హం.

సిబ్బందికి దిగులు

మద్య నిషేధ, అబ్కారీ శాఖలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లకు బదిలీ దిగులు పట్టుకుంది. ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు స్థాన చలనం కలిగించనున్నారు. ఐదు అవకాశాలు ఇచ్చి ఎంపిక చేసుకునే విధానంలో బదిలీ చేయనున్నారు. విద్యా సంవత్సరం ఆరంభమైన నాలుగు నెలల తర్వాత బదిలీ భారంగా మారింది. మరో ప్రాంతానికి వెళ్తే ఇబ్బందులు పడతామని వాపోతున్నారు. చెక్‌పోస్టుల్లోని సిబ్బంది మాత్రం బదిలీ కోరుకుంటున్నారు.

188 దుకాణాల అనుమతులకు ప్రకటన!

ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగించి కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకే అనుమతులు ఇవ్వనుంది. మద్యం దుకాణాల అనుమతులకు సంబంధించిన ప్రకటన ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేయనుంది. కర్నూలు జిల్లాలో 90 మద్యం దుకాణాలు (7 దుకాణాలు గౌడ కులస్తులకు), నంద్యాల జిల్లాలో 98 (5 దుకాణాలు గౌడ కులస్తులకు) దుకాణాల అనుమతులకు ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది. ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించి లక్కీడిప్ విధానంలో అనుమతులు కేటాయించే విధానం అమలు చేయనున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం థాలీ బజావో కార్యక్రమం చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు ప్లేట్లను గరిటెలతో వాయిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, మాజీ ఉపాధ్యక్షుడు బాలస్వామి, నాయకులు బోయ రమణ, శ్రీనివాసగౌడ్, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వెలగమాను కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోండి



కలెక్టరు రాజకుమారితో చర్చిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల, న్యూస్‌టుడే : వెలగమాను కాలువ నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కలెక్టర్ రాజకుమారిని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే బుధవారం కలెక్టర్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. వెలగమాను డ్యాం కాలువ జిందాల్ పరిశ్రమ ఆవరణలో వెళ్లాల్సి ఉన్నందున కేసీ కాల్వ, పరిశ్రమ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. గడివేములలో బైపాస్ రహదారి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. పాణ్యం మండలం మద్దూరు ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రైతులు అధిక ఆదాయం పొందాలి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేలా వ్యవసాయ సిబ్బంది అవగాహన పెంపొందించాలని ఆ శాఖ సంయుక్త సంచాలకులు కృపాదాస్ ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆయన నంద్యాల మండల అధికారులతో కలిసి బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను తనిఖీ చేశారు. బిల్లలాపురం గ్రామంలో వరి, పులిమద్ది, భీమవరం గ్రామాల్లో పొగాకు పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా కృపాదాస్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎంపిక చేసిన కర్షకులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, సహాయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణ శివారులోని విజయ డెయిరీ సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగశంకరయ్య (22) మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామానికి చెందిన నాగశంకరయ్య ద్విచక్ర వాహనంపై నంద్యాలకు వస్తున్నారు. అదే సమయంలో విజయ డెయిరీ నుంచి ద్విచక్ర వాహనదారు బయటికి వచ్చారు. వీరిద్దరి వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో నాగశంకరయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి శివలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపారు.

పంట కాల్వలో పడి బాలుడి మృతి



హర్షవర్ధన్ (పాతచిత్రం)

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు పంట కాల్వలో పడి బాలుడు మృతి చెందిన ఘటన ఆత్మకూరు మండలం వడ్లరామాపురంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లికార్జున, శారదల కుమారుడు హర్షవర్ధన్(6) రోజూలాగే బడికి వెళ్లేందుకు తయారయ్యాడు. ఉదయం ఏడు గంటల సమయంలో నాయనమ్మ రమణమ్మ ఇంటికి టిఫిన్ తినేందుకు వెళ్లారు. బడికి వెళ్లేందుకు సమయం ఉండటంతో సమీపంలో ఉన్న గొర్రెలతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు పంట కాల్వలో జారి పడ్డారు. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగిన బాలుడు మృతి చెందారు. బాలుని మృతిని జీర్ణించుకోలేక రమణమ్మ షాక్‌కు గురై మతిస్థిమితం కోల్పోయింది.

అధికారుల బాధ్యతల స్వీకరణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల సబ్ రిజిస్ట్రారుగా సత్తార్, సంయుక్త సబ్ రిజిస్ట్రారుగా రాజాచంద్రమౌళిలు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు సీనియర్ అసిస్టెంట్‌గా గోపాల్, జూనియర్ అసిస్టెంట్‌గా యోగీంద్రనాథ్‌లు కూడా విధుల్లో చేరారు. నూతన సబ్ రిజిస్ట్రారు, సంయుక్త సబ్ రిజిస్ట్రార్‌లను స్టాంప్ వెండర్లు, దస్తావేజు లేఖరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి కేకులు కోసి హడావుడి చేశారు. దీంతో కార్యాలయ కొంత సమయంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి.

నంద్యాల పట్టణం, నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల డీటీవోగా ఐశ్వర్యరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాలలో డీటీవోగా పనిచేస్తున్న శివారెడ్డి కాకినాడకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో విజయవాడ డీటీసీగా పనిచేస్తున్న ఐశ్వర్యరెడ్డి ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా రవికుమార్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్‌గా ఎస్.రవికుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నంద్యాల ఈఎస్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ రెడ్డిని అనంతపురానికి బదిలీ చేశారు. నంద్యాల డిపో మేనేజరుగా పనిచేస్తున్న మణికంఠను నర్సరావుపేట సూపరింటెండెంట్‌గా నియమించారు.

కేసుల దర్యాప్తు వేగం పెంచాలి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హత్య, పోక్సో కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా సిబ్బందిని ఆదేశించారు. నేరస్తులకు శిక్షపడేలా అన్ని ఆధారాలు సేకరించి ఛార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు.



సమీక్షా సమావేశంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులపై చర్చించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రుణ యాప్‌ల మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, సీఐలు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ, ప్రియతమ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



భోగేశ్వరునికి ఆరుద్ర నక్షత్ర పూజలు

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని దుర్గాభోగేశ్వరంలో స్వామివారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం హోమాలు జరిపించారు. భక్తులు కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

◄........ అభిషేకాలు చేస్తున్న భక్తులు

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

గడివేముల, న్యూస్‌టుడే : ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ప్రయాణ కష్టాలపై గళమెత్తండి



నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల పరిధిలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. బస్టాండ్లలో సౌకర్యాలు కరవయ్యాయి. గ్రామీణ మార్గాల్లో బస్సులు సరిగా నడవడం లేదు. కండిషన్‌లో లేని బస్సులు దారి మధ్యలో మొరాయిస్తున్నాయి. విద్యార్థి బస్సులు సకాలంలో నడవక పిల్లలు వేళకు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి. బస్టాండ్లలో వ్యాపారులు అధిక ధరలతో ప్రయాణికులను దోచుకుంటున్నారు. ఈ సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదా? 'ఈనాడు' చేపట్టిన 'మేమున్నాం.. మీకు తోడుగా' కార్యక్రమంలో మీ గళం వినిపించండి. బస్టాండ్లలో సౌకర్యాలు కొరవడ్డాయా? వ్యాపారులు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారా? మరుగుదొడ్ల వద్ద ఎక్కువ డబ్బు తీసుకుంటున్నారా? మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయా? బస్సులు వేళకు రావడం లేదా? కింది నంబర్లకు ఫోన్‌చేసి చెప్పండి. మీ సమస్యలను సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

నంద్యాల : 9533454249
ఆత్మకూరు : 9014909024
నందికొట్కూరు : 9440361729

విత్తనోత్పత్తి కేంద్రం అభివృద్ధికి కృషి

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే: తంగడంచ విత్తనోత్పత్తి కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కృపాదాసు చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణతో కలిసి తంగడంచ విత్తనోత్పత్తి



కంది పంటను పరిశీలిస్తున్న జేడీఏ, డీఏవో

క్షేత్రంలో సాగవుతున్న కంది పంటను బుధవారం పరిశీలించారు. ఏడీఏ విజయశేఖర్, ఏవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

☛ తంగడంచ ఫారం భూములను మెగా సీడ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన జేడీఏ కృపాదాసుకు వినతిపత్రం అందజేశారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కృపాదాస్ ఆదేశించారు. వెలుగోడు రైతు సేవా కేంద్రం, మండల వ్యవసాయ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, ఏవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కాలు మోపకుండా కబ్జా

☛ వ్యాపారుల ఆక్రమణలో నడక దారులు ☛ నడిరోడ్డుపై ప్రమాదకరంగా పాదచారుల రాకపోకలు



పద్మావతినగర్ ఆర్చి ఎదురుగా ఫుట్‌పాత్‌లపై ఉంచిన సామగ్రి

నంద్యాల రైతుగనరం, గాంధీచౌక్, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో నడక దారులు (ఫుట్‌పాత్‌లు) పూర్తిస్థాయిలో ఆక్రమణకు గురయ్యాయి. ఎటుచూసినా వాటిపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారుల కోసమే పుట్‌పాతలు నిర్మించారా అన్నట్లు కబ్జా చేశారు. వాటిపై పాదచారులు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాదచారులు రద్దీ రోడ్లపై వేగంగా దూసుకెళ్లే వాహనాల మధ్యే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ కారణంగా తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ అండ ఉండటంతో అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితం అవుతున్నారు.

☛ నంద్యాల పురపాలక సంఘంలో దాదాపు 10 కి.మీ. మేర ఫుట్‌పాత్‌లు ఉన్నాయి. గాంధీచౌక్ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు, శ్రీనివాస సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండు వరకు రహదారులకు ఇరువైపులా గతంలో నడక దారులను ఏర్పాటు చేశారు. వీటిని వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొందరు పూర్తిస్థాయిలో ఫుట్‌పాత్‌లపైనే దుకాణాలు, తోపుడుబండ్లు, బంకులు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు తమ దుకాణాల ముందున్న ఫుట్‌పాత్‌పై సరకులను పేర్చేశారు.

☛ నడకదారుల్లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు తమ ద్విచక్ర వాహనాలను వాటి ముందు రహదారులపై నిలుపుతున్నారు. నడకదారితో పాటు రహదారి అంచులు కూడా ఆక్రమణకు గురవ్వడంతో పాదచారులు గత్యంతరం లేక నడిరోడ్డుపై నడవాల్సి వస్తోంది.

పాదచారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

- నిరంజన్‌రెడ్డి, పురపాలక కమిషనర్, నంద్యాల

నంద్యాల పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై మాకు ఫిర్యాదులు అందాయి. మేము కూడా కొన్ని ఆక్రమణలు గుర్తించాం. ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తాం. పాదచారులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

ఎటుచూసినా దుకాణాలే..

☛ నంద్యాల పట్టణం పద్మావతినగర్ ఆర్చి నుంచి టెక్కెకు వెళ్లే దారిలో వ్యాపారులు ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించేశారు. దుకాణాల్లోని సామగ్రి మొత్తం వీటిపైనే పెట్టేశారు. పాదచారులు అడుగుపెట్టే పరిస్థితి లేదు.

☛ టెక్కె నుంచి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌లపైనే సామగ్రి ఉంచి విక్రయాలు సాగిస్తున్నారు. హోటళ్లు, తోపుడు బండ్లతో కాలిబాటలు కనిపించడం లేదు.

☛ తహసీల్దారు కార్యాలయం ఎదుట రహదారులపైనే ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. ఈ ప్రాంతంలో తహసీల్దారు కార్యాలయంతో పాటు రెండు పోలీసు స్టేషన్లు, రిజిస్ట్రారు, ఉప ఖజానా, కోర్టు, డీఎస్పీ కార్యాలయాలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డుపై ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలపడంతో మిగతా వాహనదారులు ప్రయాణించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

☛ నంద్యాల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌ను ఆక్రమించి టీకొట్లు నిర్వహిస్తున్నారు.

☛ నంద్యాల సర్వజన ఆసుపత్రి ఎదుట నడకదారిపైనే మందుల దుకాణదారులు ఏర్పాటు చేసుకున్నారు.

☛ గాంధీచౌక్‌లో నడకదారులు కిరాణా దుకాణాలకు నిలయాలుగా మారాయి. ఇక్కడే ఉన్న కూరగాయల మార్కెట్‌కు నిత్యం వేలాదిమంది ప్రజలు వస్తుంటారు. వారు రాకపోకలు సాగించేందుకు నడకదారులే కీలకం. వీటిని ఆక్రమించడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



టెక్కెలో ఫుట్‌పాత్‌లపైనే పండ్ల వ్యాపారం



ప్రభుత్వాసుపత్రి ఎదుట ఫుట్‌పాత్‌పై దుకాణాలు, రోడ్డుపై వాహనాలు

వైద్య సిబ్బంది ఎక్కడికెళ్లారు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : వైద్య సిబ్బంది ఆసుపత్రిలో లేకుండా ఎక్కడికి వెళ్లారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో 15 మంది సిబ్బందికిగాను ఆరుగురే ఉండటంతో మిగతా వారు ఎక్కడని ఆరా తీశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మార్కెట్ గేట్ల వేలాలు వాయిదా

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే : నంద్యాల పురపాలక పరిధిలోని పార్కింగ్, మార్కెట్ గేట్లకు బుధవారం వేలాలు నిర్వహించారు. ఆరు నెలల పాటు పార్కింగ్ స్థలాల నిర్వహణ హక్కులను ఓ వ్యక్తి రూ.58,500కు దక్కించుకున్నారు. పోటీలేని కారణంగా మార్కెట్ గేట్ల వేలాలు వాయిదా వేసినట్లు సహాయ కమిషనర్, ఎంహెచ్‌వో డా.అంకిరెడ్డి తెలిపారు.

చెంచులకు సంక్షేమ పథకాలు అందాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ప్రతి చెంచు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఐటీడీఏ పీవో సురేష్‌కుమార్ సూచించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉమ్మడి జిల్లాలోని 42 చెంచుగూడేల పరిధిలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

కష్టపడే వారికి సముచిత స్థానం

కొత్తపల్లి, న్యూస్‌టుడే : తెదేపాలో కష్టపడే వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత స్థానం కల్పిస్తారని ఏపీ పౌర సరఫరాల సంస్థ సభ్యుడు మహేశ్‌నాయుడు పేర్కొన్నారు. కొలనుభారతిలో ఆయన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం నుంచి తనను పౌర సరఫరాల సంస్థ సభ్యునిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు ఆయన్ను అభినందించారు.

పగిడ్యాల : మండలానికి చెందిన తెలుగునాడు విద్యార్థి సమాఖ్య కార్యదర్శి బోయ మహేశ్‌నాయుడును ఏపీ పౌర సరఫరాల సంస్థ సభ్యుడిగా నియమించడంపై తెదేపా నాయకులు జూపల్లి పెద్ద స్వాములు, తిక్కస్వామి, బాలు, జయరాముడు, రామకృష్ణ, నాగార్జున హర్షం వ్యక్తం చేశారు.

బడిలో బురద.. విద్యార్థులకు వ్యథ

ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ ఇటీవల కురిసిన వర్షానికి బురదమయం అయ్యింది. విద్యార్థులు తరగతి గదులకు వెళ్లాలంటే బురదలోనే నడవాల్సి వస్తోంది. మధ్యాహ్నం భోజనం తెచ్చుకుని తినాలన్నా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా బురదనీటిలో పడిపోవాల్సి వస్తోందని చెబుతున్నారు. మైదానంలో బడి ముందు తగ్గు ఉండటంతో వర్షంనీరు నిలుస్తోందని హెచ్ఎం వెంకటస్వామి తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు





ఫార్మాసిస్టులతో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ప్రిన్సిపల్

ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఫార్మసిస్టుల విధులు, జనరిక్ ఔషధాలు, మత్తు పదార్థాల వ్యసన విముక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేస్తున్న ఫార్మాసిస్టులు, కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్‌శెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కట్టపై వనం- మనం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల ఎస్పీజీ కాలనీ సమీపంలోని చెరువు కట్టపై రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధ



చెరువు కట్టపై కంపచెట్ల తొలగింపులో రోటరీక్లబ్ సభ్యులు

వారం వనం- మనం కార్యక్రమం చేపట్టారు. కట్టపై పెరిగిన కంపచెట్లను బుధవారం రామచంద్రారెడ్డి సౌజన్యంతో పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీ మోహన్‌రెడ్డి, కామిని బాలకృష్ణ మాట్లాడుతూ.. కట్ట వెంబడి పెద్దఎత్తున మొక్కలు నాటి సంరక్షిస్తామని తెలిపారు. నడక సాగించేందుకు అనువుగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సుధీర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రప్ప పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గం, తీర్మానాలు, కార్యక్రమాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్‌ను సంఘం నాయకులు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో పద్మజకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.తిరుపాలయ్య, సహాధ్యక్షుడు ఎం.శ్రీహరి, కోశాధికారి బి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, సిటీ అధ్యక్షుడు కె.సత్యం, మహిళా నాయకురాలు ఎ.లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలో గురు రాఘవేంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి స్మారకార్థం నిర్వహించనున్న జిల్లాస్థాయి త్రోబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆ సంస్థ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు గురురాజా క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర పీఈటీల సంఘం అధ్యక్షుడు ఏపీరెడ్డి, నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి లక్ష్మయ్య పేర్కొన్నారు. స్థానిక కేవీఎస్ఎం పురపాలక మైదానంలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల



పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి లక్ష్మయ్య

త్రోబాల్, టెన్నికాయిట్, ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు కర్నూలు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం సభ్యులు ప్రభాకర్, బత్తుల రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు

మిడుతూరు, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుందని తెదేపా మండల అధ్యక్షుడు కాతా రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మిడుతూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన వివరాలను కరపత్రాల రూపంలో ప్రజలకు అందజేశారు. ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి, కార్యదర్శి సుధీర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చెంచుల సమస్యలపై విచారణ

మహానంది, న్యూస్‌టుడే: పంటల సాగుకు అటవీశాఖ అధికారులు ఆటంకాలు సృష్టిస్తున్నారంటూ మహానంది మండలం చెంచులక్ష్మి గూడెం వాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీశైలం ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో సురేష్‌కుమార్, మహానంది తహసీల్దారు రమాదేవి, నంద్యాల అటవీ రేంజ్ సిబ్బంది బుధవారం గూడేన్ని సందర్శించారు. చెంచుల సమస్యలు తెలుసుకున్నారు. నంద్యాల అటవీ రేంజ్ ఎఫ్ఆర్వో దినేష్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ విద్యుత్తు లైన్ల ఏర్పాటును అడ్డుకుంటున్నారని చెంచుగూడెం నాయకుడు శ్రీనివాసులు అధికారులకు వివరించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొత్తపల్లి, న్యూస్‌టుడే : అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బుధవారం ధర్నా చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. తహసీల్దారు ఉమారాణికి వినతిపత్రం అందజేశారు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరకపోతే చర్యలు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కూలీలకు ఉపాధిహామీ పనుల కల్పనలో క్షేత్ర సహాయకులు లక్ష్యాన్ని చేరుకోకపోతే చర్యలు తప్పవని ఏపీడీ అన్వరాబేగం హెచ్చరించారు. కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన పనులపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలోపు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రేష్మా తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో పురుగుల నివారణ

మహానంది, న్యూస్‌టుడే : అరటి పంటలో కాండం తొలుచు పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని మహానంది ఫారంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రధానాచార్యులు డాక్టర్ ముత్యాలనాయుడు రైతులకు సూచించారు. మండలంలోని గోపవరం, గాజులపల్లె ఆర్.ఎస్ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఆలయాల్లో ప్రాయశ్చిత్త పూజలు

మహానంది, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేశారంటూ మహానంది మండలం బుక్కాపురం కోదండ రామాలయం, చెన్నకేశవాలయం, అవధూత కాశిరెడ్డినాయన, ఆంజనేయస్వామి, శివాలయాల్లో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, తెదేపా నాయకులు బుధవారం ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ మాజీ సభ్యురాలు వరలక్ష్మి, తెదేపా నాయకులు శివయ్య, సుబ్రహ్మణ్యం, నంద్యాల జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని కరివేన గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటనారాయణరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు చలమయ్య ఉదయం తన బాబాయ్ ఇంటికి టిఫిన్ ఇచ్చేందుకు వెళ్లారు. పక్క ఇంటికి చెందిన సతీష్ తన భార్యపై అనుమానంతో చలమయ్యపై గొడ్డలితో దాడి చేశారు. గొడ్డలి వేటును తప్పించుకునేందుకు ప్రయత్నించగా చెంపపై గాయమైనట్లు వివరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

సమస్యల్లో పురం.. అవస్థల్లో జనం

☛ వేధిస్తున్న మౌలిక వసతుల కొరత ☛ కొత్త కమిషనరు దృష్టిపెట్టాలని ప్రజల వినతి

పురపాలక సంఘం	ఆత్మకూరు
వార్డులు	24
జనాభా	56,716
నివాస గృహాలు	11,485
ఏటా పన్నుల ద్వారా వచ్చే ఆదాయం	రూ.2.79 కోట్లు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలక సంఘంలో మౌలిక వసతుల్లేక ప్రజలు సతమతం అవుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, అంతర్గత రహదారులు, మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా మారాయి. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో కొత్తగా అభివృద్ధి పనులేం చేపట్టలేదు. దీంతో నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. పురపాలక నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమేశ్‌బాబు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం

పట్టణంలో పారిశుద్ధ్యం లోపించింది. డంపింగ్ యార్డు లేకపోవడంతో వ్యర్థాలు, చెత్త ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి. దీంతో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వీధుల్లో పోగైన చెత్తను తరలిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో వారాల తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.



లక్ష్మీనగర్‌లో పేరుకుపోయిన చెత్త

పారిశుద్ధ్య సిబ్బంది సరిపడా లేకపోవడంతో ఇంటింటి చెత్త సేకరణ సాధ్యం కావడం లేదు. దీంతో ప్రజలు ఖాళీ స్థలాలు, రోడ్లపైనే వ్యర్థాలు పడేస్తున్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది	82 మంది
ఇంకా అవసరం	30 మంది
పట్టణంలో రోజు పోగయ్యే చెత్త	22 టన్నులు
తరలిస్తున్నది	10 టన్నులు

దారులు దయనీయం

పట్టణంలో అంతర్గత రోడ్లు దారుణంగా ఉన్నాయి. దశాబ్దాల కిందట వేసిన దారులు కంకర తేలి, గుంతలమయం అయ్యాయి. పలు కాలనీల్లో మట్టిదారులే దిక్కయ్యాయి. గత శివారు కాలనీల్లోని మట్టిరోడ్లపై గతేడాది అరకొరగా బిలుకు తరలించినా చదును చేయలేదు. దీంతో వాటిపై రాకపోకలు కష్టమయ్యాయి. ఆర్డీటీకాలనీ, ఇందిరానగర్, స్వరాజ్‌నగర్, ఏకలవ్యనగర్, అర్బన్‌కాలనీల్లో రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి.

అంతర్గత రహదారులు	46.8 కి.మీ
కచ్చా రోడ్లు	12.4 కి.మీ

తప్పని నీటి కష్టాలు

పురపాలక సంఘానికి శాశ్వత తాగునీటి వనరులు లేవు. వెలుగోడు జలాశయం నుంచి ఆత్మకూరుకు రక్షిత నీటిని అందించేందుకు తెదేపా హయాంలో రూ.116 కోట్లతో చేపట్టిన పథకానికి గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో వర్షాకాలంలో కూడా పట్టణ ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. వేసవిలో ట్యాంకర్లు, అద్దె బోర్ల ద్వారా అరకొరగా సరఫరా చేస్తున్నారు.

మొత్తం పైపులైన్లు	36 కి.మీ
కుళాయిలు	5,934
రోజూ సరఫరా చేయాల్సిన నీరు	75 ఎంఎల్డీ
ప్రస్తుతం ఇస్తున్న నీళ్లు	30 ఎంఎల్డీ

భయపెడుతున్న శునకాలు



పట్టణంలో ఎటుచూసినా వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. 471కు పైగా వీధికుక్కలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు చేయడానికి గత ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. ఈ కారణంగా రోజురోజుకు వాటి సంఖ్య పెరుగుతోంది. నిత్యం వాటి దాడిలో ప్రజలు గాయపడుతున్నారు. పట్టణంలో ప్రతినెలా సగటున 40 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి.

తరగని మురుగు కష్టాలు

పురపాలక సంఘంలో మురుగు కాల్వలు పూర్తిస్థాయిలో లేవు. సాయిబాబానగర్, ఇందిరానగర్, గరీబ్‌నగర్, స్వరాజ్‌నగర్, అక్కిరాజు కాలనీ, ఆర్డీటీకాలనీతో పాటు శివారు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి లోతట్టు కాలనీలు మునిగిపోతున్నాయి. నిత్యం వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తుండటంతో దుర్గంధం, దోమల బెడద తీవ్రమైంది.

పురపాలకలో ఉన్న పక్కా కాల్వలు	18.2 కి.మీ
కచ్చా కాల్వలు	2.5 కి.మీ



గౌడు కేంద్రంలో రహదారిపై పారుతున్న వర్షం నీరు

మౌలిక వసతుల కల్పనకు కృషి

- రమేష్‌బాబు, కమిషనరు



ఆత్మకూరు పురపాలక సంఘంలో లోతట్టు కాలనీలు, వార్డుల్లో పర్యటిస్తూ అవసరమైన మౌలిక వసతులపై ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మురుగు కాల్వలు, అంతర్గత రహదారులు, ఇంటింటికీ తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టిసారించాం. కాల్వల్లో పూడిక, వ్యర్థాల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధుల వివరాలను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

భూ సమస్యలు పరిష్కరించాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: భూ రీసర్వేతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు సంఘం నాయకులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఎంతో మంది రైతులు వివిధ రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేసి పెట్టుబడి సాయం అందించాలన్నారు. రైతు సంఘం, సీపీఎం నాయకులు రమేష్ కుమార్, రత్నమయ్య, రామచంద్రుడు, డేవిడ్, నాగరత్నం పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఓ మహిళ మంగళవారం నుంచి కనిపించడం లేదంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ అస్రార్‌బాషా తెలిపారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికొచ్చి చూస్తే కుమార్తె ఇంట్లో కనిపించలేదన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వివరించారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే సహించం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తే సహించబోమని జనసేన, భాజపా నాయకులు హెచ్చరించారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనను నిరసిస్తూ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సంఘీభావం ప్రకటిస్తూ పడకండ్లలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య మాట్లాడుతూ తిరుపతి లడ్డూ హిందువులకు ఎంతో పవిత్రమైందన్నారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ భాజపా సమన్వయకర్త బోరెడ్డి లక్ష్మీ రెడ్డి, డా. రాము, మురళీధర్ గౌడ్, సోముల శ్రీనివాసరెడ్డి, అర్జి గారి నరసింహుడు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో జనసేన, భాజపా నాయకులు

27న పూర్వ విద్యార్థుల సమావేశం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వేణుగోపాల్ బుధవారం తెలిపారు. త్వరలో న్యాక్ బృందం కళాశాలలో పర్యటించనున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల: సమస్య: ఖాదరబాదరలో నీటితొట్టెలను శుభ్రం చేయాలి. -బాల చంద్రుడు.
సమాధానం: శుభ్రం చేయిస్తాం.
-నాగేంద్రుడు, ఈవోపీఆర్డీ, శిరివెళ్ల.

డోన్‌పట్టణం: సమస్య: శ్రీనివాసనగర్‌లో టెంకాయల చెట్ల వద్ద ప్రధాన రహదారి పక్కన రెండు వీధి దీపాలు వెలగక చీకటిగా ఉంటోంది. -రమేష్, శ్రీనివాసనగర్.
సమాధానం: దీపాలు వెలిగేలా చేస్తాం.
-సురేష్, మున్సిపల్ ఏఈ.

సమస్య: కొత్త ఇందిరానగర్ నుంచి ఆటోనగర్ వరకు ఉన్న ప్రధాన కాల్వలో పూడిక పేరుకుంది. -ప్రభాకర్, ఆటోనగర్.
సమాధానం: చర్యలు తీసుకుంటాం. -సునీల్, కార్యదర్శి.

సమస్య: ఇందిరానగర్‌లో దర్గా వద్ద రహదారి మధ్యలో కాల్వపై ఉన్న కల్వర్టుకు రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారింది. -హనుమంతు, ఇందిరానగర్.
సమాధానం: మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ

ఘనంగా కాలభైరవ అష్టమి వేడుకలు

ఆళ్లగడ్డ గ్రామీణ, న్యూస్‌టుడే: పాతకందుకూరులో కాలభైరవ స్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రం అష్టమిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవ స్వామి, కాళికా మాతను ఆరాధించారు. ఆలయ ఆవరణలో రామదండు భజనసంఘం ఆధ్వర్యంలో భజన చేపట్టగా, ఆలయ నిర్వాహకులు అన్నదాన వసతిని ఏర్పాటు చేశారు.



కాలభైరవస్వామి

3నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: వచ్చేనెల 3 నుంచి జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతం చేద్దామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ సుబ్రమణ్యం కోరారు. బుధవారం కొండపేటలోని అమ్మవారిశాలలో శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకాలను కమిటీ సభ్యులతో విడుదల చేసి మాట్లాడారు.

ఆదాయం జాస్తి... సౌకర్యాలు నాస్తి..

➤ చెత్తనిల్వ కేంద్రంలేక ఇక్కట్లు ➤ కూటమిపైనే జనాల ఆశలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి మేజర్ పంచాయతీకి చెత్తనిల్వ కేంద్రం లేక జనాలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం నుంచి వచ్చే చెత్తాచెదారం, వ్యర్థాలు, ప్రధాన రహదారుల పక్కనే వేస్తుండటంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఇరుకుగా ఉన్న రోడ్లకు పక్కనే చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని నివాసితులు వాపోతున్నారు. వైకాపా పాలనలో అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో రూ.60 లక్షల ఉపాధి నిధులు మంజూరు కాలేదు. దీంతో పంచాయతీ నిధులు సుమారు రూ.6 లక్షలు వెచ్చించి రవ్వలకొండపై గుంతను తవ్వి అక్కడే చెత్తను పారబోస్తున్నారు. డంపింగ్ యార్డు కల స్థానికులకు నెరవేరలేదు. పక్కనే కొండపై చెత్తచెదారం వేసి కాల్చడంతో చెత్త నుంచి సంపదను తయారుచేసే పరిస్థితి కన్పించలేదు. ఎస్సార్బీసీ ప్రధాన కాలువ, ప్యాపిలికి వెళ్లే రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్తపోగులతో నివాసితులు ఇబ్బందులుపడుతున్నారు.

ఆదర్శగ్రామంగా ఎంపికైనా..

గత ప్రభుత్వ హయాంలో బనగానపల్లిని అధికారులు ఆదర్శగ్రామంగా ఎంపిక చేయడంతో అన్ని సౌకర్యాలు సమకూరుతాయని భావించారు. అధికారుల నిర్లక్ష్యంతో డంపింగ్ యార్డుకు రెండు ఎకరాల స్థలం సేకరించినా అడుగు ముందుకుపడలేదు. మేజర్ పంచాయతీకి ఏడాదికి రూ. కోటికి పైగా ఆదాయం సమకూరుతున్నా...జనాలు ఇబ్బందుల మధ్యే సహవాసం చేస్తున్నారు. సుమారు 12,500 ఇళ్ల వరకు ఉండగా, 5 వేల వరకు కుళాయిలు ఉన్నాయి. చెత్తాచెదారం వేసేందుకు సుమారు 30 కాలనీల్లో చిన్నపాటి కుండీలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు 8 ట్రాక్టర్ల చెత్తాచెదారం, మట్టిని బయట రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. జనాభా చూస్తే సుమారు 40 వేలకు పైగానే ఉంటోంది. డంపింగ్ యార్డు నిర్మాణం మాత్రం జరగడం లేదు.

బనగానపల్లి:	మేజర్ గ్రామ పంచాయతీ
ఇళ్లు:	12,500
జనాభా:	సుమారు 40వేలకు పైగా
వార్డులు :	20
ఓటర్లు:	28, 430
పారిశుద్ధ్య కార్మికులు:	70
నిత్యం చెత్తచెదారం:	8 ట్రాక్టర్లు



రవ్వలకొండపై వేసిన చెత్తచెదారం

రోడ్ల పక్కనే చెత్తచెదారం

- అల్లా ఉద్దీన్, బనగానపల్లి

బనగానపల్లిలో ఇటీవల రోడ్లు వేశారు. కాని మురుగు కాలువల్ని తీర్చిదిద్దలేకపోయారు. రోడ్ల పక్కనే రోజుల పాటు చెత్త చెదారం ఉంటోంది. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుంది. చెత్త నుంచి ఎరువుల సృష్టించాలన్న ఆలోచన బాగున్నా...ఆచరణలో కావడం లేదు. పెద్ద పంచాయతీకి యార్డు లేక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి కారణమని చెప్పొచ్చు. అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం

చర్యలు తీసుకుంటాం -హరిప్రసాద్, ఈవో

పట్టణ సమీపంలోని రవ్వలకొండలో నిధులు ఉండటంతో అప్పట్లో కొంతమేర నిర్మించాం. నిధులు మంజూరైతే పూర్తి స్థాయిలో విస్తరిస్తాం. ఇప్పటికీ చాలా వరకు అక్కడే వేస్తున్నాం. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి

సంజామల, న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఇంజినీరింగ్ అధికారులు, సహాయకులకు మన ఇల్లు మన గౌరవంలో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న లబ్ధిదారులతో అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: 2025 మార్చి 25 లోగా అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణ పనుల్ని పూర్తి చేయడానికి చొరవ చూపాలని మండల గృహ నిర్మాణశాఖాధికారి నరసింహారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీఆర్ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

సంజామల, న్యూస్‌టుడే: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించ వచ్చని మండల ప్రత్యేకాధికారి సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

చాగలమర్రి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో మహబూబ్‌దౌలా తెలిపారు. చాగలమర్రి పట్టణంలో 'స్వచ్ఛతాహీ సేవ'లో భాగంగా బుధవారం సంత మార్కెట్ పరిసరాలను శుభ్రపరిచారు.



కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి సోమశేఖర్‌రెడ్డి

పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి

రుద్రవరం, న్యూస్‌టుడే: వంద రోజులు కాదు... ఐదు సంవత్సరాలు కాదు రాబోయే అన్ని రోజుల్లోనూ తెదేపా అధికారంలో ఉంటుందని, పార్టీలకు అతీతంగా అందరికీ లబ్ధి చేకూరుస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. బుధవారం రుద్రవరంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రుద్రవరం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో రుద్రవరానికి చెందిన ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోవడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

చాగలమర్రి: పట్టణంలో గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహబూబ్‌దౌలా తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:పలు గ్రామాల్లో బుధవారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం ఆయా గ్రామాల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండల నాయకుడు వీఆర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. కనకాద్రిపల్లెలో ఇది మంచి ప్రభుత్వం బుధవారం నిర్వహించారు.

అవుకు, న్యూస్‌టుడే: అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవుకు చాకలిపేటలో పర్యటించి ప్రభుత్వం వంద రోజుల పనితీరుపై కరపత్రాలను అందజేశారు.



కరపత్రాలు అందజేస్తున్న చల్లా విజయభాస్కరరెడ్డి

ఆర్ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెదేపా మండల కన్వీనరు ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. బుధవారం ఆర్ఎస్ రంగాపురంలో గౌసియా బేగం అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

బూరుగల (ప్యాపిలి), న్యూస్‌టుడే: నవ్యాంధ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ పాలన లక్ష్యమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బూరుగలలో బుధవారం పర్యటించారు.

కంపల్ని తొలగించరూ!

పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కంబాలపాడు సర్కిల్ నుంచి ఇందిరానగర్‌లో శివాలయం పక్కన నుంచి 44వ జాతీయ రహదారి బైపాస్‌కు ఈ మార్గం కలుస్తోంది. ముళ్లచెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో అటుగా వచ్చేవారికి ఇవి తగలడంతో గాయాలపాలవుతున్నారు. అధికారులు చర్యలుచేపట్టాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, డోన్‌పట్టణం



రహదారి మలుపు .. ప్రమాదాలకు పిలుపు



కోటపాడు-యాళ్లూరు బీటీ రహదారి మలుపులో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. యాళ్లూరు, ఆర్.కృష్ణాపురం, ఉమాపతినగరం, వీరారెడ్డిపల్లె, శిరివెళ్ల గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విద్యుత్తు స్తంభాలతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కోటపాడు (శిరివెళ్ల)

బడి.. సమస్యల ఒడి

డి.వనిపెంట(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని డి.వనిపెంటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. పాఠశాలలో రెండు భవనాలు ఉన్నా ఒకటి శిథిలావస్థకు చేరి పెచ్చులూడి కూలే స్థితిలో ఉంది. ఉన్న ఒక్క భవనంలోనే 24 మంది విద్యార్థులతో అయిదు తరగతులను నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం వద్ద, విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్ల వద్ద గ్రామానికి చెందిన ఆకతాయిలు, మద్యం బాబులు మద్యం తాగుతూ సీసాలను అక్కడే వదిలి వెళ్తున్నారు. రాత్రిళ్లు మద్యం తాగుతున్నా చర్యలేవీ తీసుకోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఆయా పరిసరాల్లో తిరుగుతున్న విద్యార్థులకు గాజు సీసాల ముక్కలు గుచ్చుకోవడంతో గాయాలపాలవుతున్నారు. ఆకతాయిలు పాఠశాల ఆవరణలో మలమూత్ర విసర్జన చేస్తుండటంతో దుర్వాసన తట్టుకోలేక విద్యార్థులు అల్లాడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

దుర్వాసన అధికమైంది

- పద్మావతి, ప్రధానోపాధ్యాయిని, డి.వనిపెంట

పాఠశాలకు ఉన్న ఒక్క భవనంలోనే 5 తరగతులను నిర్వహిస్తున్నాం. పాఠశాల భవనం పరిసరాల్లో కొందరు వ్యక్తులు రాత్రి సమయాల్లో మద్యం తాగడం, అక్కడే మలమూత్ర విసర్జన చేస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

నేడు ఆధ్యాత్మిక సంఘాల ర్యాలీ

డోన్, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలో గురువారం హిందూ ఆధ్యాత్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ సంఘాల నాయకుడు మహారాజ్ అన్నారు. ఉదయం 10 గంటలకు స్వామి వివేకానంద విగ్రహం నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ఈర్యాలీ ఉంటుందన్నారు.

పల్లె కబుర్లు

చిత్రరేనిపల్లె (రుద్రవరం): చిత్రరేనిపల్లెలో 22 మద్యం సీసాలను లక్ష్మీనరసయ్య నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

చిత్రరేనిపల్లె(రుద్రవరం): చిత్తరేనిపల్లెకు చెందిన ఓ బాలిక బుధవారం ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

బీరవోలు(రుద్రవరం): బీరవోలుకు చెందిన తెదేపా నాయకుడు పూల్లగూర చిన్నపాములేటి అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బంగారు రాము, సత్యంరాజు, శ్రీనువాసులు, గుర్రప్ప పాల్గొన్నారు.

కోవెలకుంట్ల గ్రామీణం: భీమునిపాడు: కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డ రహదారిలో భీమునిపాడులోని చౌడేశ్వరి దేవి ఆలయం నుంచి గ్రామ సచివాలయం సమీపం వరకు ప్రధాన రహదారి దెబ్బతింది. వర్షపు నీరు గుంతల్లో చేరి వాహనాదారులు ప్రమాదాలపాలవుతున్నారు.

కంపమల్ల: కంపమల్లలో పారిశుద్ధ్యం పనులు చేపట్టకపోవడంతో మురుగు కాలువలు, చెత్తచెదారంతో అధ్వానంగా వున్నాయి. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బిజనవేముల, జొలదరాసి, పొట్టిపాడు: బిజనవేముల, జొలదరాసి, పొట్టిపాడు గ్రామాల్లో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

కోవెలకుంట్ల: అధికార ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంపై దృష్టి పెట్టకుండా వైకాపా నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మంచిది కాదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. కోవెలకుంట్లలో ఉపసర్పంచి జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఇంటి దగ్గర కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు.

అవుకు: వర్షపు నీటితో అపరిశుభ్రంగా మారిన పరిసరాలను తెదేపా నాయకుడు మిద్దె ప్రసాద్ సొంత నిధులు వెచ్చించి శుభ్రపర్చారు. ప్రొక్లెయిన్ సాయంతో తొలగించారు.

డోన్ నేరవిభాగం: మానవుని ఆయుష్షు తగ్గడానికి కల్తీ వస్తువులే కారణమని వినియోగదారుల సంక్షేమ సంఘ సంస్థ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వస్తువుల్లో కల్తీలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలన్నారు.

ఆళ్లగడ్డ గ్రామీణం: అహోబిలం పరిధిలో దుర్గమ్మ ఆలయ పరిసరాల్లో నల్లమల అటవీ ప్రాంతంలో జూదమాడుతున్న ఆరుగుర్ని గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.61,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: బిజనవేములలో తమ పొలాన్ని కొంతమంది ఆక్రమించారని బాధితులు తహసీల్దారుకు బుధవారం ఫిర్యాదు చేశారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ఓ కండక్టరు వెలుగోడు మండలం వేల్పనూరుకు చెందిన ఓ మహిళపై దురుసుగా మాట్లాడటంతో ఆమె డిపో మేనేజర్‌శశిభూషణ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు ఆదేశించామని, కండక్టర్ తిట్టినట్లు తేలితే తగు చర్య తీసుకుంటామని తెలిపారు.

డీఈ రసూల్ నంద్యాలకు బదిలీ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పురపాలక సంఘంలో డీఈగా పని చేస్తున్న రసూల్ నంద్యాల పురపాలక సంఘానికి బదిలీ అయినట్లు ఇంజినీరింగ్ ఇన్ చీఫ్, ప్రజారోగ్య శాఖ తాడేపల్లి నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు బుధవారం మున్సిపల్ అధికారులు తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్ సబ్‌రిజిస్ట్రార్‌గా మహబూబ్ బాష బుధవారం బాధ్యతలు చేపట్టారు.

అలరించిన స్వాగతోత్సవం

బేతంచెర్ల,న్యూస్‌టుడే: విద్యార్థులు కృషి పట్టుదలతో చదివితే విజయాలు సొంతమవుతాయని ఎంఈవో సోమశేఖర్, దేవన కొండ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ శర్మ పేర్కొన్నారు. పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలను నిర్వహించారు.

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన ఉండాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్గి ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతమ్మ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షలను బుధవారం నిర్వహించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు జేవీకే ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, డోన్ డివిజన్ అధ్యక్షుడు సర్వజ్ఞమూర్తి తెలిపారు. బుధవారం నిర్వహించిన పరీక్షకు 914 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

పెద్దకొప్పెర్ల(కోవెలకుంట్ల గ్రామీణం), న్యూస్‌టుడే: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్ సూచించారు. పెద్ద కొప్పెర్ల, చిన్న కొప్పెర్ల, వల్లంపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

యర్రగుంట్ల(శిరివెళ్ల): వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తేనే రైతులకు అధిక దిగుబడులు లభిస్తాయని ఆర్ఏఆర్ఎస్ నంద్యాల ప్రధానాచార్యులు, శాస్త్రవేత్త నీలిమ, డీఆర్సీ ప్రభావతమ్మ పేర్కొన్నారు. శిరివెళ్ల, యర్రగుంట్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ముత్యాలపాడు(చాగలమర్రి): గ్రామాల్లో రైతులు సేంద్రియ పద్ధతులు అవలంబిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. ముత్యాలపాడు, తోడేండ్లపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేసిన మిరపకు తామర పురుగు ఆశించే ప్రమాదం ఉందని మండల వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు.

శెట్టివీడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా ఉపాధి సిబ్బంది అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ ఏపీడీ సాంబశివుడు తెలిపారు. బుధవారం శెట్టివీడులో ఉద్యాన పంటలను పరిశీలించారు.



ఉద్యాన పంటను పరిశీలిస్తున్న ఏపీడీ

ముద్దవరం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: ముద్దవరం, పెండేకల్లు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్, ఏఈవో మధు అవగాహన కల్పించారు.

కలుచట్ల (ప్యాపిలి), న్యూస్‌టుడే: రైతులు సాగు విషయంలో సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి రాజేష్, ఉద్యానవనశాఖ అధికారిణి కల్యాణి సూచించారు. కలుచట్ల, పెద్దపూదెళ్ల గ్రామాల్లో బుధవారం పొలంబడి నిర్వహించారు.

పాతపాడు, పసుపల(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ రైతులు లాభసాటి వ్యవసాయం సాగించాలని ఏడీఏ రాజశేఖర్ పేర్కొన్నారు. పాతపాడు, పసుపల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మాట్లాడారు.

ప్రశాంతంగా జీవించాలి

పెద్దపూదెళ్ల (ప్యాపిలి), న్యూస్‌టుడే: ప్రజలు ఎటువంటి అల్లర్లకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్సై మధుసూదన్ సూచించారు. పెద్దపూదెళ్ల, చిన్నపూదెళ్ల గ్రామాల్లో బుధవారం గ్రామ సభ నిర్వహించారు.

దాత సహకారానికి అరవైఏళ్లు

అవుకు, న్యూస్‌టుడే: అవుకుకు చెందిన దివంగత సినీనటి సీహెచ్ లక్ష్మిరాజ్యం సేవల్ని పూర్వ విద్యార్థులు కొనియాడారు. అరవై ఏళ్ల కిందట ఓ పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించి వచ్చిన పారితోషికంతో అవుకు ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి విరాళం ఇచ్చి పలువురికి విద్యాదానం చేశారని కొనియాడారు. దాత చేసిన సాయానికి 60 అవ్వడంతో గుర్తుగా పూర్వ విద్యార్థులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మేడం సతీష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దాత ఔదార్యాన్ని కొనియాడారు.

విద్యార్థుల విరాళాల సేకరణ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరదల వల్ల ఎంతో మంది నష్టాల్లో కూరుకుపోయారని అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్(యూపీఎస్ఎఫ్) రాష్ట్ర డైరెక్టర్ జె. చంద్రశేఖర్ పేర్కొన్నారు. వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు తమ వంతు బాధ్యతగా విరాళాలు సేకరించి ఆయా పాఠశాలల యాజమాన్యాలు యూపీఎస్ఎఫ్ నాయకులకు బుధవారం అందించారు.

కబ్జాదారుల నుంచి కాపాడాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు టి. విజయ్‌కుమార్ డిమాండు చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో మహేశ్వరరెడ్డికి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు నాగమణికి వినతిపత్రాలను అందజేశారు.

కరాటే పోటీల్లో ఆసిఫా ప్రతిభ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థిని ఆసిఫా ప్రతిభను చాటిందని ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ప్రిన్సిపల్‌తో పలువురు ప్రశంసించారు.

నూర్‌బాష సంఘ ఏర్పాటు హర్షణీయం

చాగలమర్రి,న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో నూర్‌బాష సంక్షేమ సంఘం ఏర్పాటు చేస్తాననడం ఎంతో హర్షణీయమని మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా తెలిపారు. చాగలమర్రి పట్టణంలో నూర్‌బాష సోదరులు బుధవారం సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో తెదేపాతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఈ సందర్భంగా వారు తెలిపారు. నూర్‌బాష సంక్షేమ సంఘం సభ్యులు పీరయ్య, మస్తాన్, లాల్‌బాషా, దస్తగిరి, పెద్దబాష, పెద్దలాలయ్య, ఇమామ్‌బాష తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న నూర్‌బాష సంక్షేమ సంఘ సభ్యులు

కన్నేస్తారు.. కాజేస్తారు

◆ వెలుగులోకి వస్తున్న వైకాపా నాయకుల అక్రమాలు
◆ అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



కోవెలకుంట్ల మండలం కంపమల్లలో ఆక్రమణకు గురైన స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ యంత్రాంగం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వైకాపా అయిదేళ్ల పాలనలో ఆక్రమణల పర్వం కొనసాగింది. అధికార పార్టీ అండదండలతో ఆ పార్టీకి చెందినవారు కన్పించిందల్లా కాజేశారు. కుంటస్థలాలు, గ్రామచావిడీలు, చివరకు మరుగుదొడ్లను వదలలేదు. తమకు అడ్డేలేదనుకొని అడ్డగోలుగా స్థలాలు ఆక్రమించి ఇష్టానుసారంగా కట్టడాలు చేశారు. ఈ అయిదేళ్ల వైకాపా పాలనలో అరాచకాలు మితిమీరాయి. ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

విసిగిపోయిన జనం ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా అక్రమాలపై దృష్టి సారించాల్సి ఉంది. గ్రామాల్లో ఆక్రమణదారుల్లో ఇప్పుడు వణుకు మొదలైంది. ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న ఆక్రమణలపై అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చర్యలకు సిద్ధమవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఎక్కడెక్కడ ఎలా అంటే...?

☛ కోవెలకుంట్ల మండలంలోని కంపమల్ల గ్రామంలో సర్వే నెం.307లో 1.29ఎకరాలు, సర్వే నం.308లో 8.80 ఎకరాల్లో కుంటస్థలం ఉంది. గ్రామానికి చెందిన వైకాపా వర్గీయులు అప్పటి ప్రభుత్వంలో కుంట స్థలాన్ని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్నారు. ఓ వ్యక్తి సొంతంగా ఇంటి నిర్మాణం చేసుకోగా మరో వ్యక్తి ప్రభుత్వం మంజూరు చేసిన గృహాన్ని నిర్మించేశారు. దీనిపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లగా...ఆమె స్పందించారు. కుంటస్థలాన్ని సర్వే చేయాలని ఆదేశించడంతో అధికార యంత్రాంగం ఈనెల 24న గ్రామానికి వెళ్లి కుంట స్థలాన్ని సర్వే చేసింది. సర్వే నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు పంపారు. ☛ కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ఓ వైకాపా నాయకుడు గ్రామచావిడిపై కన్నేశారు. వారి ప్రభుత్వం అధికారంలో ఉందన్న ధైర్యంతో బస్టాండ్ సమీపంలో ఉన్న గ్రామచావిడిని ఆక్రమించేశారు. సుమారు 40ఏళ్ల కిందట ఓ దాత ఎనిమిది సెంట్ల స్థలాన్ని గ్రామచావిడికి దానం చేయగా ఏకంగా ఇంటిని నిర్మించేయడం గమనార్హం. ☛ అవుకు మండలంలోనూ వైకాపా నాయకుడు ఆక్రమణకు పాల్పడిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. శివవరం గ్రామంలో ఏకంగా మహిళలకు సంబంధించిన సామూహిక మరుగుదొడ్డినే ఆక్రమించేశారు. మరుగుదొడ్డిని పడగొట్టి ఇంటిని నిర్మించారు. ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అధికారులు దీన్ని గుర్తించి విచారించి మరుగుదొడ్డి స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇంటిని కూల్చేశారు.